క్లుప్తంగా

మానసిక వికలాంగుల పాఠశాలకు విరాళం



అరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాలకు విరాళం అందిస్తున్న దాతలు

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో ఉన్న అరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాలకు దాతలు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన ముదునూరి లక్ష్మీకాంతం, రామరాజుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట సత్య విజయకుమార్‌రాజు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. పాఠశాలలో ఫర్నిచర్ ఏర్పాటుకు నిర్వాహకులకు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ కృష్ణంరాజు, డాక్టర్ ఎంవీఎస్ రాజు, ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్



ఎమ్మెల్యే అంజిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం: భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన కె.రామచంద్రారెడ్డి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

అమ్మవార్లకు మహాకుంభాభిషేకం



దుంపగడపలో భూలక్ష్మమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఆకివీడు: దుంపగడప గ్రామంలో వేంచేసియున్న భూలక్ష్మమ్మ, మారెమ్మ, వెంకాయమ్మల ఆలయ వార్షికోత్సవం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవార్లకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయం వద్ద పుణ్యాహవాచనం, కళాఆవాహన, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు, గ్రామ శివారులో ఉన్న భూలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, కొట్టు ఆంజనేయులు, మాణిక్యాలరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం



దాత రామచంద్రరాజుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరానికి చెందిన కలిదిండి రామచంద్రరాజు రూ. 1,01,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును శనివారం ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు. దాత కుటుంబానికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

వలకు చిక్కిన కొండచిలువ



వలలో ఉన్న కొండచిలువ

పెనుగొండ: సిద్ధాంతం వద్ద గోదావరిలో మత్స్యకారుల వలకు 12 అడుగుల భారీ కొండ చిలువ చిక్కింది. సిద్ధాంతంకు చెందిన మల్లాడి రాంబాబు గోదావరిలో చేపల వేటకు వెళ్లగా భారీ ఆకారం వలకు చిక్కడంతో భయాందోళనకు గురయ్యాడు. తీరా బయటకు తీసి చూడగా మృతి చెందిన కొండ చిలువ కనిపించడంతో ఊపిరి పీల్చుకున్నాడు. ఈ కొండచిలువను చూడడానికి స్థానికులు బారులు తీరారు.

సమస్యలపై స్పందించాలి

వీరవాసరం: వీరవాసరం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని అన్నారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా వైద్యుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



వైద్య వృత్తినే పరమావధిగా భావించి సేవ చేస్తున్న మహిళా వైద్యుల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలి. కోల్‌కత్తాలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘటన చాలా బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యుల భద్రత కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలి.

– ఎ.అరుణరాణి, వైద్యురాలు, గొల్లవానితిప్ప పీహెచ్‌సీ

స్త్రీని గౌరవించే సంస్కృతి పెరగాలి



స్త్రీని తన కుటుంబంగా ప్రతి వ్యక్తీ భావించేలా తల్లిదండ్రులు పిల్లలను తీర్చిదిద్దాలి. ప్రతి మహిళనూ అమ్మగా, సోదరిగా గుర్తించే సంస్కృతి నేర్పాలి. సామాజిక, మానసిక చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. డాక్టరే కాదు, ప్రతి మహిళా ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి మహిళకు రక్షణ కల్పించే వాతావరణం ప్రజలే ఇవ్వాలి.

– గోవర్ధిని, కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యురాలు, ఆకివీడు

వరి సాగులో 'వెదజల్లు' మేలు

- ఈ విధానంతో రూ.3 నుంచి 4 వేలు వరకు ఆదా
- విత్తనశుద్ధితో తెగుళ్లు సోకే అవకాశాలు తక్కువ
- పది రోజులు ముందే పంట కోతకు సిద్ధం



వరి నారుమడిలో మందు కొడుతున్న రైతు (ఫైల్), అంతరచిత్రంలో మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: మండలంలో ఈ ఏడాది భారీ వర్షాలు, వరదల కారణంగా సార్వా సాగుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. నారుమడి దశలోనే దెబ్బతినడంతో మళ్లీ నాట్లు వేసుకోవడానికి నారు కొరత ఏర్పడింది. దీంతో వేరే ప్రాంతాల నుంచి వరినారును ట్రాక్టర్లపై కొనుగోలు చేసి తెచ్చుకుని నాట్లు వేస్తున్నారు. భీమవరం మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు,, తుందుర్రు, చినఅమిరం, రాయలం, నరసింహాపురం, కొవ్వాడ అన్నవరం తదితర గ్రామాలలో సుమారు 4 వేల ఎకరాలలో వరి నాట్లు వేశారు.

వెదజల్లు

గత జూన్ చివరి వారం నుంచి జూలై చివరి వరకు భారీ వర్షాలు పడటం, ఎర్రకాలువకు వరద ద్వారా యనమదుర్రు ఉప్పొంగడంతో నారుమడి దశలోనే పైరు దెబ్బతింది. నారుమడులలోకి చేరిన వర్షపు నీటి ఆయిల్ ఇంజన్లతోను, కారెంలతో తోడి రైతులు కాపాడుకున్నారు. కొన్నిచోట్ల నారుమడులు పూర్తిగా దెబ్బతినడంతో వదిలేశారు. దీంతో మండలంలో ఆయకట్టుకు సరిపడా వరినారు అందుబాటులో లేదు. మళ్లీ నారుమడులు వేసే సమయం లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి వరినారిని తీసుకువచ్చే అవకాశం లేని రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచిస్తున్నారు.

వెదజల్లే పద్ధతి మేలు

వరినారు కొరత ఏర్పడినప్పుడు వెదజల్లే పద్ధతి అనుసరిస్తే రెండు వారాలు సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా వరినారు తీయడం, నాట్లు వేసే ఖర్చుతో పోలిస్తే రూ.3 వేలు నుంచి 4 వేలు ఖర్చు తగ్గుతుంది. కొన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే సంప్రదాయ సాగువలె ధాన్యం అధిక దిగుబడి సాధించవచ్చని వివరిస్తున్నారు.

విత్తనశుద్ధి చేయాలి

వెదజల్లే పద్ధతిలో వరి విత్తనాలను రైతులు తప్పకుండా శుద్ధి చేయాలి. 50 కిలోల విత్తనాలకు 50 లీటర్ల నీటిని కలిపి 50 గ్రాముల కార్బన్‌డిజం మందును ద్రావణంలో కలిపి 24 గంటలు నానబెట్టిన తరువాత గోనె సంచిలో వేసి 24 గంటలు మండి కట్టాలి. విత్తనాలు ముక్కు పగిలి తెల్లగా కోర వచ్చిన తరువాత పొలంలో చల్లాలి. ఈ విధానం వల్ల పొడతెగులు, అగ్గితెగులు వంటి తెగుళ్లు సోకకుండా నివారించవచ్చు. సార్వా సాగులో ఎమ్‌టీయూ 1318, సంపద సర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1121 వరి వంగడాలు అనుకూలం. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వారం నుంచి 10 రోజులు ముందుగా పంట కోత వస్తుంది.

కలుపు నివారణ తప్పనిసరి

ఈ పద్ధతిలో పంట చేలు ఉపరితలం సమాంతరంగా ఉండాలి. ఆరుతడులకు అవకాశంగా ఉండాలి. ఎకరానికి 10 కిలోల విత్తనాలను వెదజల్లాలి. 24 గంటల తరువాత పంట చేనును ఆరబెట్టాలి. కొద్దిగా విత్తనాలు మొలకెత్తిన తరువాత మళ్లీ నీళ్లు పెట్టి తీసేయాలి. సాధారణ పంట కంటే 10 రోజులు ముందే పంట చేతికి వస్తుంది.

మావుళ్లమ్మ సేవలో చోటా కే నాయుడు దంపతులు



మావుళ్లమ్మ సన్నిధిలో సినిమాటోగ్రాఫర్ చోట కె. నాయుడు దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారిని శనివారం సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అందజేశారు.

మావుళ్లమ్మ దేవస్థానానికి విరాళం



అమ్మవారి దేవస్థానానికి విరాళం అందజేస్తున్న మల్లికార్జునస్వామి సౌమ్య దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జునస్వామి, సౌమ్య దంపతులు రూ.70 వేల విరాళం అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ, సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

డేవిడ్ మార్క్‌కు క్రైస్తవరత్న అవార్డు



కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న డేవిడ్‌మార్క్ (ఫైల్)

ఉండి: చెరుకువాడకు చెందిన డాక్టర్ ఈలి డేవిడ్‌మార్క్ క్రైస్తవ రత్న అవార్డును అందుకున్నారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 22న ఢిల్లీలో నిర్వహించిన జాతీయ క్రిస్టియన్ ఎంట్రపెన్యూర్ అండ్ ఇన్వెస్టర్స్ మీట్ సదస్సులో కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రామ్‌దాస్ అథ్‌వాలే చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు డేవిడ్‌మార్క్ శనివారం చెరుకువాడలో తెలిపారు. జాతీయ క్రిస్టియన్ బోర్డు ఆధ్వర్యంలో బోర్డు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌మస్క్, కార్యదర్శి పాల్‌డేవిడ్ ఆధ్వర్యంలో రాష్ట్రం నుంచి తనతో పాటు మరి కొందరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రైస్తవ సమాజానికి తాను చేసిన సేవలకు గుర్తింపుగా తనకు ఈ అవార్డును అందించారని అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మేడిద జాన్సన్, పలువురు ఆయనను అభినందించారు.

ట్రాన్స్‌కో సీఎండీ దృష్టికి లోవోల్టేజ్ సమస్య

కాళ్ల: దొడ్డనపూడిలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కలిసినట్లు గ్రామానికి చెందిన యర్రింకి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామంలో గత ఏడాది నుంచి లోవోల్టేజ్ సమస్య వల్ల సుమారు 300 ఇళ్లకు చెందిన కుటుంబాలు గత 20 రోజులుగా విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ ఇబ్బందులను స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో విశాఖపట్నం ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవి తెలిపారు.

బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

భీమవరం అర్బన్: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ప్రతి విద్యార్థినీ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వి.కనకమహాలక్ష్మి సూచించారు. భీమవరం మండలంలోని వెంప పంచాయతీ పల్లిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్లో శనివారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్నపిల్లల దశ నుంచే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై తల్లి, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా తమ పట్ల చెడు ప్రవర్తనను కలిగియుంటే వెంటనే విద్యార్థినులు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అలాగే మోసం చేసే వ్యక్తుల నుంచి తమను రక్షించుకునే విధంగా ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థినుల్లో పెంపొందింపజేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలపై కలిగే నష్టాలు, మహిళలపై దాడులు జరిగితే కఠిన శిక్షలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం.రమాదేవి, ఏఎన్ఎం కె.రూప్సీరాణి, ఎంఎల్ హెచ్‌పీ పి.ఆశా జ్యోతి, ఆశావర్కర్స్ జె.రామలక్ష్మి, పి.లక్ష్మీ నర్సమ్మ, డి.సునీత, సీహెచ్ చిట్టిమేరీ పాల్గొన్నారు.

జమాతే ఇస్లామిక్ హింద్ నిరసన ర్యాలీ



భీమవరం అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న మహిళా, గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సభ్యులు

భీమవరం: 'స్త్రీలకు స్వేచ్ఛ ఎప్పుడు' అనే నినాదంతో జమాతే ఇస్లామిక్ హింద్ మహిళా, గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం భీమవరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జమాత్ ఇస్లామిక్ హింద్ విభాగం కార్యకర్త అబిదా మాట్లాడుతూ మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మారకద్రవ్యాలు కారణంగా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనుషుల్లో దైవభీతి ఉండాలని పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్య నేర్పాలన్నారు. ఐద్వా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు అయినప్పటికీ మహిళలకు ఇంకా స్వాతంత్రం రాలేదని, స్వేచ్ఛగా మహిళలు బతకలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుల్తానా, మారియా హుస్నా, అక్తారి, తన్వీర్ ఫర్జానా, సుఫీ షర్మిల, సోను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే పరిశ్రమల్లో ప్రమాదాలు



భీమవరంలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: అచ్యుతాపురం ఫార్మసీ కంపెనీ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్లో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురం ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యం, ప్రభుత్వ అసమర్థత వల్లే జరిగిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సులభతర వ్యాపారం పేరుతో పరిశ్రమల్లో తనిఖీలు చేయించని కారణంగానే రాష్ట్రవ్యాప్తంగా వరుస ప్రమాదాల్లో కార్మికుల ప్రాణాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో ఉద్యోగ భద్రత, ప్రాణ రక్షణ లేదని విమర్శించారు. పరిశ్రమల్లో రోజుకు 18 గంటల పాటు అన్యాయంగా పని చేయించుకుంటున్నారని, చట్టాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రమాదంపై విచారణ జరిపి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు ఎం.ఆంజనేయులు, కె.వెంకటేశ్వరరావు, కె.కృష్ణ, బాబురావు, రంగారావు పాల్గొన్నారు.

తెలుగు భాషాదినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



భీమవరంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

భీమవరం: తెలుగు భాష ఔన్నత్యం యుగాంతం వరకు చెరగని ముద్రతో ఉంటుందని, తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి నాలుగురోజులపాటు నిర్వహించే తెలుగు భాషా దినోత్సవ బ్రోచర్‌ను శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 26న కేజీఆర్ఎల్ కళాశాలలో ప్రారంభ సభ, 27, 28 తేదీల్లో విద్యార్థులకు పోటీలు, 29న ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముగింపు సందర్భంగా 24 మంది పండితులకు సత్కారం చేస్తామన్నారు. తెలుగు భాషాభివృద్ధి సంఘం నాయకులు కలిగొట్ల గోపాలశర్మ, కోళ్ల నాగేశ్వరరావు, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.

విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై తదితరులు

ఉండి: అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆకివీడు సర్కిల్ సీఐ జగదీశ్వరరావు అన్నారు. శనివారం ఉండి దివ్య కళాశాలలో సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ఉమెన్ ట్రాఫికింగ్, గంజాయి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్ బాగుండాలంటే యువత వీటన్నింటికీ దూరంగా ఉండాలని అన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే జీవితాంతం శిక్ష అనుభవించాల్సి వస్తుందని అన్నారు. మహిళలు, విద్యార్థినుల విషయంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా వ్యవహరించాలన్నారు. వారితో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. అందుకే ప్రతీ ఒక్కరూ ముందు చూపుతో వీటన్నింటికీ దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనవసర లింకులు క్లిక్ చేయడం, మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మి నగదు పంపి మోసపోవడం వంటి వాటిపై తగిన జాగ్రత్త అవసరమని అన్నారు. ఏదైనా అనుమానంగా ఉంటే వెంటనే ఇంట్లోని పెద్దవారికి లేదా పోలీసులకు చెప్పాలని సూచించారు. ఎస్సై నయీముల్లా, కాలేజ్ డైరెక్టర్ దుర్గారావు, ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ సుబ్బారావు

కాళ్ల: దొడ్డనపూడికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన పోతురాజు ఇస్మాయిల్, తెనాలి అబ్రహం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సుబ్బారావు బాధితులను శనివారం పరామర్శించారు. వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం తన బాస్విని చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన చట్టాలను నిలుపుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఏఎల్ నాయకులు

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సివిల్, క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాసే కొత్త చట్టాలను ఉపసంహరించుకోవాలని, ప్రజా వ్యతిరేక సెక్షన్లు తొలగించాలన్నారు. బ్రిటిష కాలం నాటి నేర చట్టాల స్థానంలో తీసుకువచ్చిన కొత్త నేర చట్టాలు ప్రజల హక్కులు హరించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.న్యూటన్, న్యాయవాదులు వైవీ ఆనంద్, పాలా రాఘవేంద్రరావు, రామకృష్ణ, వీరవల్లి బాపూజీ, సూరిబాబు, ఎల్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మాలలను తక్కువ చేసి మాట్లాడితే సత్తా చూపుతాం



భీమవరంలో సంఘీభావం తెలుపుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు

భీమవరం: ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ మాలలపై చేస్తున్న వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఎస్సీవర్గీకరణ పోరాట సమితి నాయకులు నల్లి రాజేష్, గంటా సుందర కుమార్, గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. భీమవరంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ మాలలపై విషం కక్కడం మాని తన జాతికోసం పోరాటం చేసుకోవాలని హితవు పలికారు. మాలలను తక్కువచేసే మాట్లాడితే మాదిగల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటం స్టాన్లీ, తాళ్లూరి మధు, బిరుదుగడ్డ రమేష్ బాబు, టి.ప్రశాంత్, బడుగు అశోక్, గుండే నగేష్, ఈది రవికుమార్ ఉన్నారు.

వెంకన్నకు ఘనంగా ఊంజల్ సేవ



దీపాలంకరణలో స్వామి వారికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ శనివారం పర్వదినాన్ని పురస్కరించుని ఉదయం 10 గంటలకు గుడివాడ మహిళా మండలి సభ్యులు కోలాటం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. పంచమి విశేష పర్వదినం కావడంతో తెల్లవారు జాము నుంచి భక్తులు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీస్వామి వారి దేవాలయం భక్తుల గోవింద నామ స్మరణతో మారుమోగింది. భక్తులకు ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.